క్లుప్తంగా

మానసకు దాతల సాయం



ఆర్థికసాయం చేస్తున్న యూత్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన గౌరిగారి మానస తలలో రక్తం గడ్డ కట్టి పక్షవాతంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, మానసకు మేమున్నాం అంటూ.. దాతలు సాయం అందించారు. కడు పేదరికం అనుభవిస్తున్న మానసకు ఖరీదైన వైద్యం అందించేందుకు చేతిలో చిల్లి గవ్వ లేదు. దీంతో మంగళవారం 'సాక్షి'లో వచ్చిన 'ప్రాణ భిక్షపెట్టండి'అనే కథనానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన దోస్త్ ఫౌండేషన్ ఫర్ గుడ్ హ్యూమనిటీ సభ్యులు మంగళవారం రూ.6,100 సాయం అందించారు.అలాగే మరో స్వచ్ఛంద సంస్థ రూ.5 వేల సాయం అందజేశారు. కూలి పనులు చేసుకునే మానస భర్త సతీశ్ తన భార్యకు ప్రాణాలు పోసి కాపాడాలని దాతలను వేడుకుంటున్నాడు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శివరామకృష్ణ, శ్యామ్, కిరణ్, రాజు, రాజేశ్ పాల్గొన్నారు.

'డబుల్' పంపిణీలో అవకతవకలు



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట: మండల కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్లను అనర్హులకు కేటాయించారని, అధికారులు రీసర్వే నిర్వహించి అర్హులైన నిరుపేదలను గుర్తించాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ భూపతికి వినతిపత్రం సమర్పించారు. భూమి, ఇళ్లు ఎలాంటి ఆస్తులు లేని పేదలను విస్మరించి అనర్హులైన వారికి ఇళ్లు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పంపిణీ చేసిన ఇళ్లపై, మిగిలిన ఇళ్ల పంపిణీ కోసం అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని, పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వారి వెంట బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు, దరఖాస్తుదారులు ఉన్నారు.

మైనార్టీ రుణాల్లో అర్హులకు మొండిచేయి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న ముస్లింలు

వీర్నపల్లి: ప్రభుత్వం ఇచ్చిన మైనార్టీ లోన్లలో అర్హులకు అన్యాయం జరిగిందంటూ వీర్నపల్లి మండల కేంద్రం లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మైనార్టీ మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 26 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం ఆరుగురికి మాత్రమే లోన్లు వచ్చినట్లు తెలిపారు. ఇందులో కూడా బీఆర్ఎస్ చెందిన కార్యకర్తలకు ఇచ్చినట్లు ఆరోపించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి, ఎంపీడీవో నరేశ్‌కుమార్‌కు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ వాలి అక్రం, అబ్దుల్, షబీర్, రుస్తుం, హరీప్, షారుఖ్, మౌలానా, అనూష, సానా, ఆశాభీ, ముంతాజ్ పాల్గొన్నారు.

పేరుకే మిషన్ భగీరథ

- తాగునీటి పథకాలకు గ్రహణం
- పట్టింపులేని అధికార గణం
- పంచాయతీలదే నీటి సరఫరా
- వృథాగా ఓహెచ్ఎస్ఆర్‌లు

ముస్తాబాద్: మిషన్ భగీరథ నీటి సరఫరా సరిపోవడం లేదు. డిమాండ్‌కు తగిన విధంగా నీటిని అందించడంలో తరుచూ అవాంతరాలను ఎదుర్కొంటుంది. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఉదాసీనత కారణంగా ప్రభుత్వ లక్ష్యంగా నేరవేరడం లేదనే విమర్శలున్నాయి. ముస్తాబాద్ మండలంలో శిథిలమైన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, కొన్నిచోట్ల ధ్వంసమైన పైపులైన్ ఉండడంతో ప్ర'జల' బాధలు తీరడం లేదు. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతోపాటు, తాగునీటిని అందించే అగ్రహారం, కోళ్లమద్ది నీటి పథకాలలో కూడా సమృద్ధిగా నీటి లభ్యత ఉంది.

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం

ముస్తాబాద్ మండలంలోని 22 గ్రామాలకు నీటిని అందించేందుకు మిషన్ భగీరథలో గ్రిడ్ పనిచేస్తుంది. అగ్రహారం నీటి పథకాల నుంచి సరఫరా చేస్తున్నారు. అయితే నీటి పైపులైన్ల పలుచోట్ల ధ్వంసం కావడం, పథకానికి చివరి గ్రామాలకు సరిగా నీరు చేరడం లేదు. ముఖ్యంగా గ్రిడ్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సరిగా అశ్రద్ధనే ఇందుకు కారణమని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. గేట్‌వాల్వ్‌లు, పైపులైన్లు ధ్వంసం అయిన చోట వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. నీటి లభ్యత ఆధారంగా చివరి గ్రామాలకు నీరందించే బాధ్యత గ్రిడ్ అధికారులు తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజులకొకసారి మిషన్ భగీరథ నీరు వస్తోందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్‌కు తగిన సరఫరా ఎక్కడ?

ముస్తాబాద్ మండలానికి రోజుకు 4,671 కిలోలీటర్ల నీరు డిమాండ్ వుంది. అయితే రోజుకు 3 నుంచి 4 వేల కిలో లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. పైపులైన్లు ధ్వంసం, మోటార్లు కాలిపోవడం వంటి సమస్యలతో డిమాండ్‌కు సరిపడ నీటిని అందించలేకపోతున్నారని సమాచారం.

పక్కన ఉన్న ఫొటోలో శిథిలావస్థలో కనిపిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ గూడెం గ్రామం లోనిది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంక్ పెచ్చులూడుతోంది. దీంతో గ్రామపంచాయతీ పాలకవర్గం నీటిని ట్యాంక్‌లోకి ఎక్కించడం లేదు. పక్కనే మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ట్యాంక్ పడిపోతే ప్రమాదం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు ట్యాంక్‌లకు మాత్రమే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. స్థానికంగా పంచాయతీ బోరుమోటార్ల నుంచి నీటిని అందిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు ఏడాది క్రితమే శిథిలమవుతున్న ట్యాంక్‌ను చూసి ప్రతిపాదనలు చేశారు. రోజు పెచ్చులు, సిమెంట్ ఊడిపడడంతో చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు.



ఇవీ సమస్యలు..

➡ ఆవునూర్‌లో మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదు. ఇక్కడ పైపులైన్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే నల్లా కనెక్షన్లు పూర్తి స్థాయిలో ఇవ్వలేదు.

➡ బందనకల్‌కు భగీరథ నీరు మూడు నాలుగు రోజులకొకసారి వస్తోందని ప్రజలు చెప్తున్నారు.

➡ తెర్లుమద్దిలో మిషన్ నీరు సరిపోకపోవడంతో, గ్రామపంచాయతీ బోరు మోటార్ల నుంచే సరఫరా చేస్తున్నారు.

➡ కొండాపూర్‌లో మూడు రోజులకు ఒకసారి మిషన్ నీళ్లు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు అంటున్నారు.

➡ ముస్తాబాద్‌లో మార్కండేయ ఆలయం వద్ద ఉన్న 90 వేల లీటర్ల ట్యాంక్ అలంకారప్రాయంగా ఉంది. కొన్నేళ్లుగా దీనిని వినియోగించడం లేదు.

➡ ముస్తాబాద్ పట్టణంలో వందకు పైగా వన్, ఫైవ్ హెచ్‌పీ మోటార్లతో డైరెక్టు పంపింగ్ చేస్తున్నారు.

➡ కేసీఆర్ కాలనీలో పైపులైన్ ధ్వంసం కావడం, మోటార్లు కాలిపోతున్నాయి. భగీరథ నీటిని అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

➡ ముస్తాబాద్ ఎస్సీ కాలనీలో నీటి సమస్య అధికంగా ఉంది.

పంచాయతీలకు భారం..

ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత.. పంచాయతీలకు నీటి సరఫరా బాధ్యతలను తొలగించారు. ఎలాంటి బోర్లు, మోటార్లు పెట్టరాదనే నిబంధనలు ఉన్నాయి. అయితే మిషన్ భగీరథలో లక్ష్యానికి అనుగుణంగా నీటి సరఫరా జరగకపోవడంతో మళ్లీ బోరు, మోటార్ల ద్వారానే నీటిని అందించాల్సి వస్తోంది. మిషన్ భగీరథపై ఆధారపడితే ప్రజలు ఇబ్బందులు పడుతారని సర్పంచులు అంటున్నారు. మిషన్ భగీరథ ఉన్నప్పటికీ, పంచాయతీలలో ప్రతినెల మోటార్లు కాలిపోవడం, పైపులైన్లు రిపేర్లు చేయడం, కొత్త బోర్లు వేయడం వంటి పనులు చేస్తున్నారు. దీంతో పంచాయతీ నిధులు నీటి కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. నీటి ఖర్చులు పంచాయతీలకు భారంగా మారాయి.

నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నాం

మండలంలో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తున్నామని గ్రిడ్ ఏఈ వినయ్ తెలిపారు. డిమాండ్‌కు సరిపడా నీటిని సరఫరా చేస్తున్నాం. చివరి గ్రామాలకు నీటిని అందిస్తున్నాం. పైపులైన్ల మరమ్మతుతోనే అప్పుడప్పుడు ఇబ్బందులు వస్తున్నాయి. సమస్యలను అధికారులకు నివేదిస్తున్నాం.

బైటినుంచి తెచ్చుకుంటున్న..



ఆవునూర్‌కు మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవు. మా ఇంటికి నల్ల కనెక్షను ఇచ్చిండ్రు. బయట బోరు మోటారు వద్ద రోజు నీళ్ల తెచ్చుకుంటున్నం. రోజు ఇట్ల నీళ్ల మోసుకునుడే అయితుంది. సార్లు మాకు మిషన్ భగీరథ నీల్లు ఇయ్యాలే. – తాలూక దేవయ్య, ఆవునూర్

నీరు రావడం లేదు



ముస్తాబాద్‌లో ఎస్సీ కాలనీకి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. కేసీఆర్ కాలనీలో కూడా సమస్య ఉంది. పంచాయతీ ద్వారానే డైరెక్టు పంపింగ్ చేస్తున్నాం. మార్కండేయ ఆలయం వద్ద ట్యాంక్ నిరుపయోగంగానే ఉంటుంది. దీనిపై అధికారులకు నివేదిక ఇస్తున్నాం. – శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

నల్లా నీళ్లు వస్తలేవు..



మా ఇంటికి పంచాయతీది ఒకటి, మిషన్ భగీరథది ఒక నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఒక్క నల్ల కూడా వస్తలేదు. నీళ్ల బయట నుంచి రోజు మోసుకుంటున్న. రోజు నీళ్ల కోసం తిప్పలు పడుతున్నం. సార్లు ఆలోచించి రోజు నల్లాల ద్వారానే నీల్లు ఇచ్చేటట్టు చూడాలే. – మంత్రి మణేమ్మ, ఆవునూర్

పథకం విఫలమైంది



మిషన్ భగీరథ లోప భూయిష్టంగా ఉంది. పంచాయతీల ద్వారానే నీరు ఇస్తున్నారు. చాలాచోట్ల పైపులైన్లు వేయలేదు. పాత నల్లా కనెక్షన్లతోనే నీటి సరఫరా జరుగుతుంది. ఆవునూర్‌లో విఫలమైంది. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. – క్రాంతికుమార్, బీజేపీ నాయకుడు

నియామకం

బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా హరీశ్

బోయినపల్లి: బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా నీలోజిపల్లి గ్రామానికి చెందిన కొనుకటి హరీశ్, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా విలాసాగర్ గ్రామానికి చెందిన సుంక పాక ప్రభును నియమిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి తెలిపారు. అలాగే బీజేపీ మండల కార్యదర్శిగా వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన నడిగొట్టు శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ ఉదారి నర్సింహాచారి, రాజూరి కిరణ్, సారంపల్లి రాజు ఉన్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామం రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్తు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పూర్మాని తిరుపతి రెడ్డి, కోశాధికారి మూర్తి విఠల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్తంగి సత్తి రెడ్డి, కార్యదర్శి పూర్మాని భూపల్ రెడ్డిలు ఎన్నికయ్యారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు



ఎస్సై వెంకటేశ్వర్లు

తంగళ్లపల్లి: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసి ఇతర మనోభావాలను దెబ్బతీసేలా పోస్టు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తంగళ్లపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల ప్రజలు సోషల్ మీడియా పోస్టులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రూప్ అడ్మిన్లు ఇలాంటి పోస్టులపై వెంటనే స్పందించి డిలీట్ చేయాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బతికున్నంతకాలం సేవ చేస్తా

- బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

వేములవాడరూరల్: బతికున్నంత కాలం ఈ ప్రాంత ప్రజల కోసం సేవ చేస్తానని బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామంలో చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయనను మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి, సర్పంచ్ తిరుపతి, జైపాల్‌రెడ్డి, గొస్కుల రవి, శంకర్, అంజనీకుమార్, సోమినేని బాలు, ఈర్యానాయక్ పాల్గొన్నారు.

విత్తన ప్రాసెసింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న మదన్‌మోహన్

కోనరావుపేట: మండలం మామిడిపల్లిలో జిల్లా ఏరువాక కేంద్రం(కరీంనగర్) ఆధ్వర్యంలో గ్రామంలోని ఆదర్శ రైతు పరస్పర సమాఖ్య సంఘం రైతులకు విత్తన ప్రాసెసింగ్ మరియు విత్తన ధ్రువీకరణ మీద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కే.మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విత్తనోత్పత్తి దగ్గర నుంచి విత్తనాన్ని ప్రాసెసింగ్ చేయడం వరకు మార్కెటింగ్ చేయడం వరకు ఉత్పత్తిదారుల సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రావెప్ విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ గెలవాలని 108 కొబ్బరి కాయలతో పూజలు



కొబ్బరికాయలు కొడుతున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మంత్రి కేటీఆర్ మరోమారు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాలని స్థానిక హనుమాన్ ఆలయంలో ఎంపీపీ పడిగెల మానస ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలతో పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అధిక మెజార్టీతో గెలుపొందాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రోజ, ఎంపీటీసీ కోడి అంతయ్య, వార్డు సభ్యులు రెడ్డి పరుశరాములు, లక్ష్మారెడ్డి, జగత్‌కుమార్, అంకారపు లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



మాట్లాడుతున్న గోపాల్‌రావు

ముస్తాబాద్: పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేయాలని రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో గొల్లకురుమలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గోపాల్‌రావు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా సిరిసిల్లను అభివృద్ధి చేశారన్నారు. రైతు బంధు, రైతుబీమా, కమ్యూనిటీ భవనాలు, ఉచిత విద్యుత్, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి పథకాలను అమలు చేశారన్నారు. మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించి, మరింత అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. సర్పంచ్ విజయ, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొమ్ము బాలయ్య, సర్వర్, నారాయణ, అంజయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు

వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు, అన్ని గ్రామాల్లో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిందని ఎంపీడీవో నరేశ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందితో గ్రామంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు, జెండా గద్దెలకు ఉన్న రాజకీయ పార్టీ గుర్తులను రెండు రోజుల్లో కనపడకుండా చేస్తామన్నారు. అందుకు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ పార్టీల వారు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు.



గుర్తు కనబడకుండా గోడకు పెయింట్ వేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

30 వరకు ఓటరు నమోదు గడువు

ముస్తాబాద్: ఈ నెల 30 వరకు కొత్త ఓటర్ల నమోదు చేపట్టాలని తహసీల్దార్ గణేశ్ బీఎల్‌వోలకు సూచించారు. మార్పులు, సవరణ, చేర్పులకు అవకాశాలు కల్పిస్తున్నామని



సంక్షిప్త వార్తలు

గోశాలకు రాజన్న కోడెలు



వేములవాడఅర్బన్: తిప్పాపూర్ గోశాలలోని 20 రాజన్న కోడెలను మహబూబాబాద్ జిల్లా ఇన్‌గుర్తి మండలం మేచరాజుపల్లిలోని మహాలక్ష్మి గోశాలకు మంగళవారం అందజేశారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన సిరిసిల్ల ఏఎంసీ డైరెక్టర్ శ్యాగ దేవేందర్‌ను మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసిరెడ్డి అవినాష్ రెడ్డి, ఎంపీటీసీ బైరినేని రాము పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్‌కు మద్దతు

రుద్రంగి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌కు మద్దతు తెలుపుతామని మండల కేంద్రానికి చెందిన శ్రీ చైతన్య మున్నూరు కాపు యూత్ సంఘం సభ్యులు మంగళవారం ఏకగ్రీవ తీర్మానించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, సంఘం సభ్యులు నరేశ్, నర్సయ్య, మహిపాల్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం గడపగడపకు కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్, నాయకులు పాల్గొన్నారు.

పాము కాటుతో ఆవు మృతి

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ పరిధిలోని రేగులపల్లి గ్రామానికి చెందిన నక్క మల్లేశం జెర్సీ ఆవు మంగళవారం పాము కాటుతో మృతి చెందింది.

పరామర్శ

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన బీమనాతిని భూమయ్య ఇటీవల మరణించగా.. మంగళవారం వారి కుటుంబ సభ్యులను మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పరామర్శించారు. ఆయనతోపాటు ఒగ్గు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన యువతకు సన్మానం

రుద్రంగి: మండలం మానాల, గిరిజన తండా గ్రామాలకు చెందిన ఆరుగురు యువకులు, ఒక యువతి ఎంపిక కావడంతో మానాల సర్పంచ్ అల్లూరి మానస, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూము జలపతి యువతీ, యువకులను శాలువాతో ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్తీయ కార్యక్రమం వేములవాడ ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య పరీక్షల్లో చిన్నారులకు 122 మందికి పరీక్షలు చేయగా స్క్రీనింగ్ 103, డెంటల్ 6, సీహెచ్‌డీ 1 పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు లహరిక, పావని, గౌస్ పాల్గొన్నారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి బన్నాజీ

ముస్తాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో బన్నాజీ అన్నారు. మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన పోర్టల్‌లోనే వివరాలను ఉంచాలన్నారు. హెచ్‌ఎంలు రాధాకిషన్ రావు, రాజిరెడ్డి, రవీందర్,లక్ష్మణ్, సుధాకర్, సత్యం, ప్రభాకర్‌రెడ్డి, సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం



రాళ్లపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, మునిగెల రాజు, లక్ష్మీరాజం, నేరెళ్ల నర్సింగం గౌడ్, సుద్దాల శ్రీను, ప్రతాప్ రెడ్డి, పర్శరాం, వెంకటరెడ్డి, హారికా రెడ్డి, సరితా, తిరుపతి యాదవ్, నాగరాజు, సాయిప్రసాద్, ఇక్బాల్, బాబు అలీ, బలరాం గౌడ్, భరత్ గౌడ్, అరెపల్లి బాలు, చిలుక శ్రీను, శ్యామ్, సంపత్ పాల్గొన్నారు.

పరామర్శ

వేములవాడ: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన గోలి మహేశ్ కౌన్సిలర్ తండ్రి శంకరయ్య, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన సింగారపు లింగవ్వ అనే మహిళ అనారోగ్యంతో మంగళవారం మరణించారు. వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవిరాజు, కౌన్సిలర్లు మారం కుమార్, ఇప్పపూల అజయ్, జెడ్పీటీసీ ఏశ వాణి, ఎంపీపీ బండ మల్లేశం, సర్పంచులు జైపాల్‌రెడ్డి, కట్కం మల్లేశం, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీమా చేయండి.. ధీమాగా ఉండండి

వేములవాడరూరల్: పోస్టల్ శాఖ బీమా పథకానికి పల్లెల్లో మంచి ఆదరణ లభిస్తోంది. మండలంలోని లింగంపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపు ను సర్పంచ్ కవిత ప్రారంభించి గ్రామంలోని ప్రతి ఒక్కరు బీమాను ఉపయోగించుకోవాలని కోరారు. తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, కిషన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు



వేములవాడ: వేములవాడలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఆసుపత్రికి వెళ్లి చూసినా జ్వరపీడితులే ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నారు. కంపుకొడుతున్న డ్రైయినేజీలు శుభ్రం చేయడం, ఫాగింగ్ వైద్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై మరోసారి ప్రజల్లో అవగాహనం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.